పనులు పూర్తికాక పరేషాన్

- మక్త క్రాస్‌రోడ్డు నుంచి వీణవంక మండలం చల్లూరు వరకు డబుల్‌రోడ్డు
- కంకరపోసి క్రషర్ డస్ట్‌తో రోలింగ్
- డస్ట్‌తో అవస్థలు పడుతున్న వాహనదారులు
- ఇళ్లలోకి దుమ్ము వస్తోందని, పనులు పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు


అసంపూర్తిగా డబుల్‌రోడ్డు పనులు

శంకరపట్నం: మండలంలోని మక్త క్రాస్‌రోడ్డు నుంచి వీణవంక మండలం చల్లూరు వరకు డబుల్ రోడ్డు నిర్మిస్తున్నారు. మక్త క్రాస్‌రోడ్డు నుంచి కన్నాపూర్ వరకు కంకరవేసి వదిలేశారు. వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ము, ధూళి లేచి కళ్లలో పడుతోంది. దీంతో వెనుక వచ్చే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సింగిల్‌రోడ్డును డబుల్ రోడ్డుగా చేసేందుకు రూ.27 కోట్లు మంజూరు చేసింది. రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కల్వర్టుల నిర్మాణంతోపాటు రోడ్డుపై కంకరపోసి క్రషర్ డస్ట్‌తో రోలింగ్ చేయడంతో రోడ్డుపై వాహనాలు వెళ్తున్నప్పుడు డస్ట్‌తో అవస్థలు పడుతున్నారు. మండలంలోని మక్త, ముత్తారం, కన్నాపూర్ గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ల ప్రజలు దుమ్ముతో అనారోగ్యానికి గురవుతున్నామని ఆరోపిస్తున్నారు. రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ బీటీ రోడ్డు పనులు పూర్తి చేయలేదు. డిసెంబర్‌లోపు పనులు పూర్తి చేయాల్సి ఉండగా పనులు నెమ్మదిసాగుతున్నాయని ఆరోపణలు వెలువడుతున్నాయి.

రోడ్డుపై నీరుచల్లడం లేదు

కంకర, క్రషర్ డస్ట్‌తో రోడ్డు పనులు చేపడుతుండటంతో రోడ్డుపై ట్యాంకర్లతో ఉదయం, సాయంత్రం నీరు చల్లడం లేదు. వాహనాల రాకపోకలతో దుమ్ములేస్తోంది. ఇళ్లు దుమ్ముతో నిండుకుంటున్నాయని రోడ్డు పక్కనున్న నివసిస్తున్న ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని, దుమ్ము లేవకుండా పనులు పూర్తయ్యే వరకు నీరు చల్లించాలని కోరుతున్నారు.

దుమ్ము లేస్తోంది



రోడ్డుపై కంకరపోసి క్రషర్ డస్ట్‌తో రోలింగ్ చేయడంతో దుమ్ము లేస్తోంది. అధికారులు తారురోడ్డు పనులు పూర్తి చేస్తే వాహనదారుల ఇబ్బందులు తీరుతాయి.

– సంపత్, మక్త

రోడ్డుపై నీరు చల్లాలి



మక్తా క్రాస్ నుంచి చల్లూరు వరకు చేపట్టిన డబుల్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి. దుమ్ము లేవకుండా ఉదయం, సాయంత్ర రోడ్డుపై నీరు చల్లించాలి.

– రాజయ్య, ముత్తారం

పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం

కంకర, క్రషర్ డస్ట్‌తో గ్రామస్తులు, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్న విషయం మాదృష్టికి వచ్చింది. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం.

– అమీర్‌పాషా, డీఈ

క్లుప్తంగా

పాఠశాలల సందర్శన


విద్యార్థులతో మాట్లాడుతున్న సీపీడీ బృందం

జమ్మికుంట: తొలిమెట్టులో భాగంగా పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, అంబేడ్కర్‌కాలనీ ప్రభుత్వ పాఠశాలలను సీపీడీ (కంటిన్యూయస్ ప్రొఫేషనల్ డెవలప్‌మెంట్) బృందం సభ్యులు సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలోని బేస్ లైన్ టెస్ట్ పేపర్స్, సమ్మెటీవ్ అసెస్‌మెంట్ పేపర్ వాల్యుయేషన్, టీచింగ్ డైరీ, ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. పదో తరగతి లక్ష్య ప్రోగ్రామ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో విడుపు శ్రీనివాస్, బృందం సభ్యులు ఓదేలుకుమార్, ఎండీ షరీఫ్ అహ్మద్, సురేఖ, సరిత, హెచ్‌ఎంలు దామెర సుధాకర్, ఆకుల సదానందం, రాజ్‌కుమర్, శకుంతల, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


నగదు, బియ్యం అందిస్తున్న నిర్వాహకులు

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన సూతికాడి విజయ్ ఇటీవల అనారోగ్యానికి గురికాగా వైద్య ఖర్చుల నిమిత్తం పీఎంకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పల్లె ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం బాధిత కుటుంబానికి రూ.2,500, 25 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో పల్లె రవిగౌడ్, గిరవేన రాజయ్య యాదవ్, బండారి శ్రీనివాస్ యాదవ్, గండి యాదగిరిగౌడ్, రంజిత్‌కుమార్‌గౌడ్, మహ్మద్ హసన్‌తో తదితరులు పాల్గొన్నారు.

37 మంది బైండోవర్

వీణవంక: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 33 మంది బెల్టుషాపుల నిర్వాహకులు, పాత కేసుల్లోని నేరస్తులను తహసీల్దార్ తిర్మల్ రావు ఎదుట బైండోవర్ చేశామని ఎస్సై ఆసిఫ్ తెలిపారు. ఎన్నికల నియమావళిలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేశామని వివరించారు.


జమ్మికుంట: నలుగురు వ్యక్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని టౌన్ సీఐ బొర్రాటి రమేశ్ సోమవారం తెలిపారు.మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటకు చెందిన ఇద్దరు, మండలంలోని నాగంపేటకు ఇద్దరు వ్యక్తులను బైండోవర్ చేశామన్నారు.

అన్యాయాన్ని ఎదిరించేందుకు ఎంత దూరమైనా వెళ్తాం


నియామకపత్రం అందుకుంటున్న లతారెడ్డి

హుజూరాబాద్: మానవ హక్కులకు భంగం కలిగితే ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధమని, న్యాయం జరిగే వరకు కృషి చేస్తానని మానవ హక్కుల పరిరక్షణ ఉద్యమ సంస్థ నియోజకవర్గ ఇన్‌చార్జి లతారెడ్డి అన్నారు. సోమవారం హుజూరాబాద్ ప్రెస్ క్లబ్‌లో మాట్లాడారు. నమ్మకంతో నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ పటేల్, జిల్లా అధ్యక్షుడు పూలకం నరసయ్య, జిల్లా కార్యదర్శి మొగిలి సతీశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎగ్గడి శ్రీనివాస్ పటేల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కౌన్సిలర్ కల్లెపల్లి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ శ్రీధర్

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో పోలీసులు, కేంద్ర బలగాల ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇద్దరిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీధర్, రాజేశ్ తోపాటు పోలీసులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఇప్పలనర్సింగాపూర్ వద్ద కాకతీయ కాలువలో కొట్టుకుపోతున్న గుర్తుతెలియని మృతదేహం సోమవారం లభ్యమైంది. ఆదివారం సాయంత్రం అలుగునూర్ ఎల్ఎండీ కాలువలో మారుతీనగర్‌కు చెందిన బొమ్మ నాగరాజు(32) గల్లంతయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మీటరు మార్పు చేసిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి

చొప్పదండి: ఒకరికి కేటాయించిన మీటరును మరొకరికి మార్పు చేసిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని వెదురుగట్టకు చెందిన పంతంగి పర్శయ్య సోమవారం ట్రాన్స్‌కో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఇరువై ఏళ్ల క్రితం మీటరు తీసుకుంటే, ఇంట్లో కిరాయికి ఉన్న వారికి మీటరు మార్పు చేశాడని ఆరోపించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఇష్టారాజ్యంపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరారు. స్థానిక అధికారుల అండదండలతో అక్రమాలు వెలుగులోకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

బ్రాహ్మణ సామాజికవర్గం అభ్యర్థుల విజయానికి కృషి

హుజూరాబాద్‌రూరల్: బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందినవారికి ఆయా పార్టీలు అసెంబ్లీ టికెట్లు కేటాయించడం ఆనందంగా ఉందని, పార్టీలకతీతంగా అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని జిల్లా బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు విష్ణుదాస్ గోపాల్‌దాస్ తెలిపారు. మండలంలోని అహల్యానగర్‌లో మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు రాజకీయంగా సామాజికవర్గం ఎదగాలనీ పట్టణంలో నిర్వహించిన బ్రాహ్మణ శంఖారావం విజయవంతం వల్ల ఈ ఫలితాలను సాధించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని సుమారు 16 లక్షల కుటుంబాలు ఏకతాటిపైకి వచ్చి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో హుజూరాబాద్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితెల ప్రణవ్‌బాబు, మంథని అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు రాష్ట్రంలో పోటీచేస్తున్నవారి గెలుపునకు కృషిచేస్తామన్నారు.

అందరివాడను అవకాశమివ్వండి


ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే రసమయి

గన్నేరువరం: అందరివాడిగా మెలిగాను మరోసారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని పారువెల్ల గ్రామం శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. పారువెల్ల, యాస్వాడ, గోపాల్‌పూర్, జంగాపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. కేసీఆర్ పాలనలో సాగునీరు, వ్యవసాయానికి 24 గంటల కరెంటు అందుతుందన్నారు. మళ్లీ అధికారంలోకి రాగానే బీఆర్ ఎస్ మేనిఫెస్టో అమలు చేస్తామన్నారు. జంగాపల్లిలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా, మండల కోఆర్డినేటర్లు గూడెల్లి తిరుపతి, బద్దం తిరుపతిరెడ్డి, సర్పంచ్ ఎంపీటీసీ ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, సర్పంచులు చిన్నల నగేష్, జక్కనపల్లి మధుకర్, ఉప సర్పంచ్ రఘునాథ్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానికుడిని ఆశీర్వదించండి


రుద్రారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు: స్థానికుడిని తిరిగి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని దత్తోజీపల్లి, రంగసాయిపల్లి, రుద్రారం, గాండ్లపల్లి గ్రామాలలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మోతె రిజర్వాయర్‌ను నిలిపివేసి రూ.255 కోట్లతో మోతె కాలువల నిర్మాణం చేపట్టింది. నియోజకవర్గంలో 30 వేల ఎకరాలు సాగు లోకి వస్తాయని తెలిపారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రజల ఆశలకు అనుగుణంగా, అన్నివర్గాల జీవితాల్లో వెలుగులు నింపేలా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కవితాలక్ష్మణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, మాజీ ఎంపీపీ కిష్టారెడ్డి, మురళి, నాయకులు గంట్ల వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బండ అజయ్‌రెడ్డి, ఎంపీటీసీ గుర్రం దేవిక రాజశేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు, మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన వీర్ల సంజీవరావు తల్లి సత్తమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, సర్పంచ్ వీర్ల సరోజన ప్రభాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

గన్నేరువరం: రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని కర్ణాటక ఎమ్మెల్యే వనప్పడి వజల్ అన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆరెపల్లి మోహన్‌కు మద్దతుగా మండలంలోని జంగాపల్లి, మైలారం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు, బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని విమర్శించారు, ప్రజలు బీజేపీకి ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు, కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నియోజకవర్గ కన్వీనర్ జగన్‌రెడ్డి, రామచంద్రం, వెంకటేశం పాల్గొన్నారు.

గోమాతను రక్షించే పార్టీకే ఓటెయ్యండి


సమావేశంలో మాట్లాడుతున్న కుమార్

హుజూరాబాద్: గోమాతను రక్షించే యుగ తులసి పార్టీ రోడ్డురోలర్‌కు గుర్తుకు ఓటేసి గెలిపించాలని పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి కాసెట్టి కుమార్ కోరారు. సోమవారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. నమ్మకంతో హుజూరాబాద్ అభ్యర్థిగా నియమించిన పార్టీ అధ్యక్షుడు శివకుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గోమాతలను రక్షించేందుకు వెయ్యి ఎకరాల భూమి అడిగితే త్వరలో ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మొదటి విడత ఏడు నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఖరారు చేశామని, రాబోయే రోజుల్లో మిగతా అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు ఏసీ రమేశ్‌విన్ (రాపెల్లి), పాలిక వెంకటేశ్వర్లు, రాము, నరేశ్ పాల్గొన్నారు.

'రవిశంకర్‌కు విశ్రాంతి కల్పిస్తాం'


మాట్లాడుతున్న కనకం వంశీ

గంగాధర: చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను రాబోయే ఎన్నికల్లో ఓడించి విశ్రాంతి కల్పిస్తామని దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం వంశీ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం దళిత సంక్షేమ సంఘం మండల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. దళిత వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ దళితుల అభివృద్ధికి ఆటంకంగా మారారని విమర్శించారు. దళితులకు వ్యతిరేకంగా వ్యవహరించే రవిశంకర్‌ను ఐక్యంగా ఓడించాలని పిలుపునిచ్చారు. నవంబర్ మొదటి వారంలో నిర్వహించే నియోజకవర్గ స్థాయి దళిత సమర భేరికి తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో దళిత సంక్షేమ సంఘం సీనియర్ నాయకుడు కట్టెకోల లక్ష్మణ్, లంకదాసరి తిరుపతి, ఎడవెల్లి వంశీ, భూమయ్య, రాజు పాల్గొన్నారు.

నేడు ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం


మాట్లాడుతున్న పిట్టల సమ్మయ్య

శంకరపట్నం: మంగళవారం జరిగే ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి పిట్టల సమ్మయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలోమాట్లాడారు. 1920లో పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటివరకు కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు సదానందం, రాములు, రవి, కొమురయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ మృతి చెందగా సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్ఎస్‌కు చరమగీతం పాడాలి


ప్రచార ర్యాలీలో మేడిపల్లి సత్యం


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం: బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడాలని కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ నియోజకవర్గ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. డబుల్ రహదారి నిర్మిస్తామని ఏడాది కింద హామీ ఇచ్చారని నేటికి అతీగతి లేదన్నారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టే ఎమ్మెల్యేకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఈసందర్భంగా పూజ అనే మహిళ బీఆర్ఎస్ వాళ్లకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని, మీ పార్టీ అధికారంలోకి వస్తే ఎలా అమలు చేస్తారని ప్రశ్నించింది. అర్హులకు పథకాలు అమలు చేస్తామని కవ్వంపల్లి హామీ ఇచ్చారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంత రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మల్లేశం, మండల అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కనకయ్య, శంకర్, నాయకులు రాజేందర్ రెడ్డి, పరిపూర్ణాచారి, సంపత్ రెడ్డి, మల్లేశం, చంద్రారెడ్డి, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మానకొండూర్: మండల కేంద్రానికి చెందిన వార్డ్ మెంబర్ బిలవేణి రమేశ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవీంద్రాచారి, సంపత్, ఎంపీటీసీ సంపత్, తిరుపతి, శ్రీనివాసరెడ్డి, మహమ్మద్ ఇర్ఫాన్, సురేశ్, బందెల మహేందర్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలుచేస్తాం

చొప్పదండి: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్‌పార్టీ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం అన్నారు. పట్టణంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీలపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోందన్నారు. కార్యక్రమంలో కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ముద్దం తిరుపతిగౌడ్, పురం రాజేశం, కొట్టె అశోక్, పెరుమాండ్ల గంగయ్య గౌడ్, మునిగాల సుధాకర్ గౌడ్, రంగయ్య, రమేశ్ గౌడ్, రాములు, చందు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


వాకర్స్‌తో మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్: కమలాపూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, సీనియర్ నాయకుడు నల్లాని సురేశ్ ఆధ్వర్యంలో, పట్టణానికి చెందిన ముస్లిం యువకులు, మహిళలు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ అఫ్సర్ ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల ప్రణవ్ సమక్షంలో పార్టీలో చేరారు. హుజూరాబాద్ ప్రాంత అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని, రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు.

పీవీ జిల్లా ఏర్పాటుకు సహకరించాలి

హుజూరాబాద్‌రూరల్: పీవీ జిల్లా ఏర్పాటుకు సహకరించాలని కోరుతూపీవీ జిల్లా సాధన జేఏసీ కన్వీనర్ భీమోజు సదానందం, జేఏసీ నాయకులు ప్రణవ్‌కు వినతిపత్రం సమర్పించారు. జేఏసీ నాయకులు పాడిశెట్టి వెంకట రాజం, వేల్పుల రత్నం ,ఈదులకంటి రవీందర్ రెడ్డి, తాటిపల్లి రాజన్న, పల్కల ఈశ్వర్ రెడ్డి,ఆలేటి రవీందర్,చందుపట్ల జనార్ధన్, తాళ్లపల్లి రమేష్,డాక్టర్ తడికమళ్ళ శేఖర్, రామ్ సారయ్య, సొల్లు బాబు, మిడిదొడ్డి శ్రీనివాస్, వేల్పుల ప్రభాకర్, మార్త రవీందర్, మొలుగూరి కొమరయ్య, జమదగ్ని పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌ను ప్రణవ్ ఆత్మీయంగా పలకరించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో జమ్మికుంటకు ప్రత్యేక స్థానం ఉందని, జమ్మికుంట పట్టణ, హుజూరాబాద్ అభివృద్ధిపై పలువురి సూచనలు, సలహాలు స్వీకరించారు. నాయకులు సుంకరి రమేష్, ఎండీసలీం, ఎగ్గని శ్రీనివాస్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్రాన్, పూదరి శివకుమార్, సత్తిరెడ్డి, సుమన్, ముద్దమల్ల రవి,కిరణ్, రమేశ్, కుమార్‌తోపాటు పాల్గొన్నారు.

స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేపై అవగాహన


మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే (ఎస్ఈఏఎస్)పై జూనియర్ కళాశాల విద్యార్థులు, ఎంపిక చేయబడిన పాఠశాల ఉపాధ్యాయులకు ఎంఈవో విడుపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నవంబర్ 3న పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 3, 6, 9వ తరగతుల విద్యార్థులకు మండలంలోని ఎంపికైన 48 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షను జూనియర్ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తారని, పరీక్ష నిర్వహించే విద్యార్థులకు విధానంపై సూచనలు, సలహాలు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్, మండల కోఆర్డినేటర్ ఆకుల సదానందం, కన్వీనర్ దాసరి మహేశ్, ఎన్నికాబడిన పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు,సీఆర్‌పీలు, పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ


వీణవంక: ఉపాధి హామీ సామాజిక తనిఖీ బృందం మంగళవారం నుంచి మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో చేసిన పనులపై తనిఖీ చేయనుందని ఎంపీడీవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 2022 నుంచి మార్చి 2023 వరకు కూలీలు, మేట్‌ల వేతనాలు, మెటీరియల్‌కు రూ.3,63,17,634 ఖర్చు అయిందని వీటిపై బృందం తనిఖీ చేస్తుందని వివరించారు. ఎన్నికల నియమావళికి లోబడి తనిఖీ జరుగుతుందని అనంతరం నివేదికను కార్యాలయంలో సమర్పిస్తారని తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యారులు


ప్రణీతను అభినందిస్తున్న ఎస్సై తిరుపతి

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అక్షర స్కూల్ విద్యార్థిని బండారి ప్రణీత ఎస్‌జీఎఫ్ కరాటే విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈసందర్భంగా ప్రణీతను రామడుగు ఎస్సై తోట తిరుపతి సోమవారం అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మినుకుల మునీందర్, కరాటే మాస్టర్ సుంకె రాజు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీలకు..


ఎస్‌కే తన్వీర్

హుజూరాబాద్: పట్టణంలోని కేరళ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఎస్కే తన్వీర్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ సబ్‌జూనియర్ అండర్–14 పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల కరస్పాండెంట్ విన్సెంట్ జార్జ్ సోమవారం తెలిపారు. 29న జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పేర్కొన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణకు ఐక్యతతో ఉద్యమించాలి



హుజూరాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు ఐక్యతతో ఉద్యమించాలని మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్ మాదిగ అన్నారు. సోమవారం పట్టణంలో మాట్లాడారు. వర్గీకరణకు అడ్డుపడుతున్న పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. 29 సంవత్సరాలుగాప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేందర్ మాదిగ, మండల అధ్యక్షుడు శనిగరం ప్రశాంత్, జమ్మికుంట, వీణవంక మండల అధ్యక్షులు దొడ్డ శ్రీకాంత్, కంటి రాజ్‌కుమార్ తదితరులున్నారు.